క్లుప్తంగా

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి

జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

దోమ: సీపీఎం మహాసభలను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. వెంకటయ్య కోరారు. శనివారం దోమ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ప్రజల పక్షానా తమ పార్టీ అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్తయ్య, రఘురాం, చెన్నారెడ్డి, మొగులయ్య, శ్రీనివాస్, కిష్టప్ప, బుగ్గయ్య, మొగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటు హర్షణీయం



ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మోమిన్‌పేట: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు అశిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు రైతులను దృష్టిలో పెట్టుకొని బోర్డు ఏర్పాటు చేయడం రైతుల అదృష్టమన్నారు. పసుపు రైతు సమస్యల పరిష్కారానికి బోర్డు ఉపయోగపడుతుందన్నారు. దేశంలోనే పసుపు పండించడంలో తెలంగాణ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రంగారెడ్డి, మైపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, బాలరాజ్, సాయి రాంగౌడు తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి



పెద్దేముల్ శిశుమందిర్ విద్యాలయానికి బెంచీలు అందజేస్తున్న సంతోష్‌కుమార్ గుప్తా

తాండూరు రూరల్: సేవతోనే సంతృప్తినిస్తొందని లయన్స్ క్లబ్ తాండూరు అధ్యక్షుడు రొంపల్లి సంతోష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. శనివారం పెద్దేముల్ మండలంలోని శిశుమందిర్ పాఠశాలకు విద్యార్థులు కూర్చొవడానికి బెంచీలను అందజేశారు. బెల్కటూర్‌లో నర్సమ్మ అనే మహిళకు కుట్టుమిషన్ కూడా పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, సోము, అసద్ అలీ, గౌరీశంకర్, మహేశ్, గురు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

విశ్రాంత డిప్యూటీ డీఈఓ స్వరాజ్‌బాబు



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న స్వరాజ్‌బాబు

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విశ్రాంత డిప్యూటీ డీఈఓ స్వరాజ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విశ్రాంత డిప్యూటీ డీఈఓ సహకారంతో 84 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్వరాజ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అనేది ఎంతో కీలకమన్నారు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, తద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శైలజ, బుద్దదేవ్, రెడ్యాలాల్, సంతోష్‌బాబు, శ్రీనివాసులు, సర్వరాజ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగులు!

- వృథాగా విద్యుత్
- బంద్ చేయని పంచాయతీ సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. గ్రామంలో ఏ వీధి చూసినా వెలుగుతూనే ఉంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు. సాధారణంగా గ్రామాల్లో రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలిగించి, ఉదయం బంద్ చేస్తారు. కానీ ఈ గ్రామంలో వీధి లైట్లు వెలుగుతున్నా పట్టించుకునే వారు లేరు. గ్రామంలో వెలుగుతున్న వీధి దీపాలను గ్రామ పంచాయతీ సిబ్బంది బంద్ చేయడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యుత్ వృథాఅవ్వడమే కాకుండా బిల్లు అధికంగా వస్తుందని అధికారులు చెబుతున్నారన్నారు. ఈ బిల్లును గ్రామ పంచాయతే భరిస్తుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. విచ్చలవిడిగా విద్యుత్‌ను వృథా చేసి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంలో తమకేమి పట్టనట్లు అధికారుల తీరు ఉండడం బాధాకరం. గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బందిలో ఒక ఎలక్ట్రికల్ వ్యక్తి ఉంటూ నిత్యం వాటిని పర్యవేక్షించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో అధికారులు స్పందించి వీధిలైట్లను రాత్రి సమయాల్లోనే వినియోగించుకునేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



హస్నాబాద్‌లో పగలు వెలుగుతున్న విద్యుత్‌దీపం

ప్రజాభిప్రాయ సేకరణకే గ్రామసభలు

కుల్కచర్ల: ప్రభుత్వం మంజూరు చేయనున్న సంక్షేమ పథకాల అమలునకు ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకే గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని నవాబుపేట ఎంపీఓ భద్రునాయక్ పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ మండలం పుర్సంపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రకటించిన నూతన సంక్షేమ పథకాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలపై గ్రామసభల ద్వారా అభిప్రాయాలను తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ నివేధికను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మణికంఠ, టీఏ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ కె.మణికంఠ, సీసీ ఐకేపీ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి రామక్రిష్ణ, శ్రీకాంత్ రెడ్డి, ఎం.క్రిష్టారెడ్డి, ఎర్ర శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



పుర్సంపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం



కొడంగల్: ట్రోఫీతో క్రీడాకారులు

దౌల్తాబాద్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పోలీస్ కానిస్టేబుల్ కన్కప్ప పేర్కొన్నారు. మండలంలోని సురాయిపల్లి గ్రామంలో శనివారం యువజన సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: పట్టణంలో యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో సిటిజన్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కొడంగల్ ఎస్టీ బాలుర వసతి గృహ విద్యార్థులు, రెండవ హుస్సేన్‌పూర్ జట్టు, మూడోవ అప్పాయిపల్లి, నాలుగోవ కర్నాటక రాష్ట్రం ముధేల్ జట్టుకు దక్కింది. నయీమ్, ఆనంద్‌రెడ్డి, సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మోమిన్‌పేట: సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోమిన్‌పేట: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని మార్కెటు కమిటీ మాజీ సభ్యుడు నర్సింలు పేర్కొన్నారు. ఎన్కేపల్లిలో రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా భూగర్భ మురుగు నీటి కాల్వల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా పేర్కొన్నారు. యాలాల మండల కేంద్రంలోని ముసిరిపేటలో రూ.15లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి చొరవతో ఎమ్మెల్యే గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాగయ్య, మోయిజ్, మారుతి, అశోక్ నాయిా, సులేమాన్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



యాలాల: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రేపు కంటి వైద్య శిబిరం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎల్ఎస్ఆర్ యువసేన వ్యవస్థాపకుడు లొంక నర్సిములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్ఎస్ఆర్ యువసేన, హై దరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచితకంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్‌కార్డు జీరాక్స్, ప్రస్తుతం వాడుతున్న కంటి మందులు వెంటతెచ్చుకోవాలని నర్సిములు సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 20 మందిని ఆపరేషన్ కోసం, మరో 26 మందిని కంటి అద్దాల కోసం గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకొని, కంటి వైద్యులు సూచించిన విధంగా అద్దాలు వాడడం లేదా, అవసరమైన వారు ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా కంటి సమస్యలను దూరం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీసీఐ మేనేజర్ పవన్ కుమార్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

చేవెళ్ల/మొయినాబాద్: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన పాండుయాదవ్‌ను శనివారం మండల పరిధిలోని రామన్నగూడ మాజీ సర్పంచ్ నడిమొల్ల లావణ్యశంకర్ సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ బాలయ్య, చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్దన్, నాయకులు వెంకటేశ్, విష్ణు, బాబు, మాణిక్యం, సత్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

ఇంటర్ నోడల్ అధికారి శంకర్

అనంతగిరి: ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ బలోపేతానికి అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్ నోడల్ అధికారి ఎస్ శంకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రచురించిన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని, వారికి సరైన మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్ రావు, సురేశ్వర స్వామి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, కార్యదర్శి మంజుల, ఉపాధ్యక్షుడు మల్లి నాదప్ప, స్టేట్ కౌన్సెలర్ పండరి, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి బుచ్చయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శంకర్

హనుమాన్ ఆలయంలో పారాయణం



పూజలో హిందూ వాహిని సభ్యులు

కొడంగల్: పట్టణ శివారులో సిద్ధులు తపస్సు చేసిన పవిత్రమైన సిద్ధనొంపు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. 69 వారాలుగా సామూహికంగా హనుమాన్ చాలీసాను పటిస్తున్నారు. హిందూ వాహిని ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి రాకేశ్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంటి సర్వేష్‌లతో పాటు పలువురు భక్తులు ఆలయంలో పూజలు చేశారు. చాలీసా పారాయణాన్ని పూర్తి చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

బంట్వారం: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని నియోజకవర్గ ఇంచార్జ్ రొంపల్లి నర్సింలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన వికారాబాద్‌లోని విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు.

పరిగిలో..

పరిగి: పట్టణంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆశయ సాధన కోసం కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, చిన్నయ్య, బాల్‌రాజ్, రాములు, నాగప్ప, వెంకటయ్య, రాంచందర్, అనంతరెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ అంబేడ్కర్ చౌరస్తాకు మహర్దశ

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు మండలాల్లో పనులు జోరుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే కొడంగల్ పట్టణంలో రెండు జాతీయ రహదారులు, అంబేడ్కర్ చౌరస్తాను విస్తరించనున్నారు.

◆ నవోదయకు 22మంది విద్యార్థుల గైర్హాజరు

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ అర్హత పరీక్షకు 22మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రానికి 215మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 193మంది పరీక్ష రాశారని తెలిపారు.

◆ పరామర్శ

కుల్కచర్ల: ఈ నెల 13వ తేదిన కుల్కచర్ల మండల స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో శనివారం కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ ఆయన ఇంటికి వెళ్లి క్షేమసమాచారాన్ని తెలుసుకున్నారు.

◆ మార్కెట్‌కు 992 సంచుల కందుల రాక

ధారూరు: ధారూరు వ్యసాయ మార్కెట్‌కు శనివారం 992 సంచుల కందులు వచ్చాయని కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. క్వింటాల్‌కు తక్కువగా రూ.7,250, మధ్యస్తంగా రూ.7,300, ఎక్కువగా రూ. 7,460 వరకు ధర పలికిందని ఆమె వివరించారు.

◆ మహిళా సంఘాలకు శిక్షణా తరగతులు

బంట్వారం: మహిళా సమాఖ్య అధ్యక్షులు, వీఓఏలకు గ్రామ సంఘాలకు శనివారం కోట్‌పల్లి రైతు వేదికలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం శివయ్య పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామ సంఘం, మండల సమాఖ్య విధులు నిబంధనలపై ఆయన వివరించారు. త్వరలోనే మహిళా సమాఖ్య గ్రామ మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

◆ భూమిలేని నిరుపేదల గుర్తింపు

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఆత్మీయ భరోస పథకం కింద మండలంలో 1,380 మంది భూమిలేని నిరుపేదలను గుర్తించినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. భూమిలేని నిరు పేదలు ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులపాటు పని చేసి ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో క్షుణంగా పరిశీలించిన తర్వాత గ్రామ సభలో భూమిలేని వారి వివరాలను చదివి వినిపిస్తారన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకరవాలని ఆయన సూచించారు.

◆ రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక

యాలాల: కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాల సేకరణపై రెవెన్యూ అధికారులు విచారిస్తున్నారు. మండలంలోని అన్నసాగర్ గ్రామంలో శనివారం ఆర్ఐ సాయిచరణ్ సిబ్బందితో కలిసి దరఖాస్తుదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిపేటలో సాగుయోగ్యత భూములపై ఏఈఓ శిరీష వివరాలు సేకరించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా కుల్కచర్ల మండలంలో 32గ్రామాలకు గాను 1,088 మంది దరఖాస్తు చేసుకోగా 19మంది దరఖాస్తులను తిరస్కరించారని తహసీల్దార్ మురళీధర్ పేర్కొన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని 26గ్రామాల్లో 697దరఖాస్తులకు గాను 23 తిరస్కరించారని, 102 పరిశీలనలో ఉన్నట్లు చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు పేర్కొన్నారు.

◆ బడి బయట పిల్లలు ఉండొద్దు

దుద్యాల్: పాఠశాలకు వెళ్లి చదువుకోవలసిన పిల్లలు బడి బయట ఉండొద్దని దుద్యాల్ మండల సీఆర్‌పీ రాందాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చెట్టుపల్లి తండాలో ఇంటింటి సర్వే చేపట్టి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే పనిలో నిమజ్ఞమయ్యారు. అందులో భాగంగానే గ్రామానికి చెందిన సరితా, నిహారికలను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను పాఠశాలకు పంపించాలని చదువుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాఠశాల హెచ్‌ఎం దీలిప్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న లబ్ధిదారుల ఎంపిక సర్వే

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో నాపరాతి మైనింగ్ భూములకు రైతు భరోసా వర్తించదని తాండూరు తహసీల్దార్ తారా సింగ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బెల్కటూర్, చిట్టిఘనాపూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ...కరన్‌కోట్, ఓగిపూర్, మల్కాపూర్, కోటబాసుపల్లి, సంగెంకలాన్ గ్రామాల్లో నాపరాతి భూముల్లో పకడ్బందీగా సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టా భూముల్లో నాపరాతి గనుల తవ్వకాలు జరిపినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

కుల్కచర్ల: అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు జిల్లా అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు కుల్కచర్ల మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం పీరంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వివరాలను సేకరించి ఎంపిక చేస్తామన్నారు.

మోమిన్‌పేట: వ్యవసాయేతర భూములుగా కన్వర్షన్ కాని వెంచర్లే అధికమని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి పేర్కొన్నారు. మోమిన్‌పేట పరిసర ప్రాంతాల్లో సర్వేయర్ శ్రీనివాస్‌తో కలిసి సర్వే చేశారు. నాళా కన్వర్షన్ కాకుండ నిర్మించిన భవనాలు, కోళ్ల ఫారాలను రైతు భరోసా నుంచి తొలగిస్తామన్నారు. సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి అనువుగా ఉన్న భూములను తహశీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు వ్యవసాయాధికారులు పరిశీలించారు. ప్లాట్లుగా మారిన భూములను, లే అవుట్లను, వ్యవసాయానికి యోగ్యంగాకాని భూములను గుర్తించారు. నాలా అనుమతి తీసుకున్న భూముల సర్వే నంబర్లను నమోదు చేసుకున్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: రైతు భరోసా అమలునకు చిట్లపల్లి గ్రామంలో వ్యవసాయేతర భూములను పరిశీలించారు. సాగుకు యోగ్యమైన భూములు, ప్లాట్లు, వెంచర్లుగా చేసిన భూములను గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ అనిత, ఆర్ఐ రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: సర్వే వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని తిర్మాలాపూర్, సుల్తాన్‌పూర్, నాగసార్, బాలంపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు.

దోమ: కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. మండల పరిధిలోని రాకొండా, కిష్టాపూర్ గ్రామాలను ఆయన సందర్శించి అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంటి, రేషన్ కార్డుల సర్వేను ఆయన పరిశీలించారు.



తాండూరు రూరల్: బెల్కటూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్



కుల్కచర్ల: సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటయ్య, ఎంపీడీఓ రామకృష్ణ

దుద్యాల్: రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ వేగం చేసింది. అందుకుగాను అధికారులు సాగుకు యోగ్యంకాని భూములపై ప్రత్యేక దృష్టి సారించారు. నాజుఖానపల్లిలో సాగుకు మోగ్యం కానీ భూములను ఉప తహసీల్దార్ వీరేశ్‌బాబు పరిశీలించారు.

బషీరాబాద్: తహసీల్దార్ వెంకటేశ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సర్వేయర్ ప్రభు కొర్విచెడ్‌గ ని, మాసన్‌పల్లి గ్రామాల్లో సర్వేచేశారు. ఈ రెండు గ్రామాల పరిధిలో సాగు యోగ్యతలేని భూములను గుర్తించారు. పట్టాలు ఉన్నా నాపరాతి గనుల భూములు, బీడు భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడలో వ్యవసాయసాగుకు యోగ్యం కాని భూములను వ్యవసాయ అధికారి తులసిరాం పరిశీలించారు. ఫాంల్యాండ్ చేసి విక్రయాలు జరిపిన భూములు, గోల్కొండ టెక్స్‌టైల్ కంపెనీలను సందర్శించారు. వ్యవసాయ భూమిలో ప్లాట్లు చేసి విక్రయించిన వారు గతంలో రైతుబంధూ తీసుకున్నారని తెలిపారు.